క్లుప్తంగా

విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి


దేవా ఆసిన్(ఫైల్)

పెద్దేముల్: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు జరిగింది. ఎస్ఐ కాశీనాథ్ వివరాలు ప్రకారం.. పెద్దేముల్ మండలం మారేపల్లి గ్రామ శివారు (నవ భారత్)సుద్ద పరిశ్రమలో నాలుగేళ్లుగా ఒడిస్సా రాష్ట్రానికి చెందిన దేవా ఆసిన్ (40) కార్మికుడిగా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా కరెంట్ ప్యానల్ బోర్డులో వైర్లు సరిచేస్తుండగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే వైద్య చికిత్స నిమిత్తం తాండూరుకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆసిన్ మృతి చెందాడు. అతడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి భార్య, రెండున్నర నెలల పాప ఉంది.

ప్రలోభాలకు గురికావొద్దు


తొర్మామిడిలో పోలీసుల ఫ్లాగ్ మార్చ్

బంట్వారం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం బంట్వారం మండల కేంద్రంతో పాటు, తొర్మామిడి, రొంపల్లి గ్రామాల్లో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ధారూరు సీఐ రామకృష్ణ మాట్లాడారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని కోరారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాజ్యాంగం కల్పించిన ఓటును దుర్వినియోగం చేయకూడదని, ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. బంట్వారం, ధారూరు ఎస్ఐలు ఆనంద్‌కుమార్, సంతోష్‌కుమార్, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ పాల్గొన్నారు.

మక్కువతోనే నటించా..


అభిమానులతో నటుడు హన్మంతు

తాండూరు టౌన్: తాండూరు పట్టణానికి చెందిన హాస్యనటుడు హన్మంతు నటించిన 'కీడాకోలా' చిత్రం ఇటీవల విడుదల కాగా.. సోమవారం పట్టణానికి వచ్చిన హన్మంతు అభిమానులతో కలిసి సినిమా చూశారు. ఈ సందర్భంగా పట్టణ వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు. అనంతరం హన్మంతు మాట్లాడారు. నటన మీద ఇష్టంతోనే సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లలో నటించానని, తాజాగా తరుణ్ భాస్కర్ దర్శకత్వంలో తీసిన కీడాకోలా సినిమాలో నటించినట్లు ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని పాత్రలు పోషించి, కమెడియన్‌గా రాణించాలన్నదే తన లక్ష్యమన్నారు.

ఒకే గుర్తు.. రెండు వర్గాల ప్రచారం

కుల్కచర్ల: పార్టీ గుర్తు ఒక్కటే.. వారందరూ బీఆర్ఎస్ నేతలే.. కానీ ప్రచారం మాత్రం విడివిడిగా చేస్తూ ఓటర్లను అయోమయానికి గురిచేస్తున్నారు. కుస్మసముద్రం గ్రామంలో మాజీ ఎంపీపీ అరుణరాజప్ప తనయులు ప్రసన్న, ఉప సర్పంచ్ సుకన్యలాలు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహిస్తుండగా.. అదే గ్రామంలో సర్పంచ్ రోజా కుటుంబీకులు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మయ్య ఆధ్వర్యంలో మరోవైపు ప్రచారం చేస్తున్నారు. కాగా ఇరు వర్గాలు గులాబీ కండువాలు ధరించి, ప్రచారం హోరెత్తిస్తుండటంతో గ్రామస్తులు విస్మయ చెందుతున్నారు.

నియామకం


నియామకపత్రం అందుకుంటున్న మహ్మద్

ధారూరు: కాంగ్రెస్ పార్టీ వికారాబాద్ నియోజకవర్గం మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శిగా లాల్ మహమ్మద్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం జిల్లా అధ్యక్షుడు అయూబ్ అన్సారీ నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్, పీసీసీ ప్రధాన కార్యదర్శి రఘువీరారెడ్డి, పార్టీ నేత మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

మొయినాబాద్: కారు ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. నక్కలపల్లికి చెందిన బుచ్చయ్య(60) ఆదివారం రాత్రి రోడ్డు పక్కనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా హైదరాబాద్ నుంచి చేవెళ్ల వైపు వెళ్తున్న కారు అయన్ను ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన బుచ్చయ్యకు ప్రథక చికిత్స అనంతరం ఉస్మానియ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు అక్కడి వైద్యులు తెలిపారు.

సంక్షేమంలో నంబర్ వన్

- బీఆర్ఎస్ హ్యాట్రిక్ సాధిస్తే రాష్ట్రం మరింత వృద్ధి
- అన్ని రంగాలను అభివృద్ధి చేసిన సీఎం కేసీఆర్
- కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మవద్దు
- ఇంటింటి ప్రచారంలో గులాబీ శ్రేణులు


ధారూరు: కొండాపూర్‌ఖుర్దులో ప్రచారం చేస్తున్న గులాబీ శ్రేణులు


దోమ: ఐనాపూర్‌లో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీమణి ప్రతిమారెడ్డి


కుల్కచర్ల: ఇంటింటి ప్రచారం

దోమ: తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుందని బీఆర్ఎస్ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి అన్నారు. సోమవారం దోమ మండలం ఐనాపూర్‌లో పార్టీ కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్ వన్‌గా కేసీఆర్ నిలిపారని చెప్పారు. రైతులకు 24గంటల విద్యుత్, ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారని తెలిపారు. దళారీ వ్యవస్థను రూపుమాపి సంక్షేమ ఫలాలు నేరుగా అర్హులకు అందేలా కృషి చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసిన సేవకు ప్రతిఫలంగా కారు గుర్తుకు ఓటేసి, సీఎం కేసీఆర్‌ను, ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. కాంగ్రెస్ మోసపూరిత మాటలు నమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో పార్టీ మహిళా కా ర్యకర్తలు లక్ష్మి, శేట్టి మంజుల తదితరులు పాల్గొన్నారు.

ఇంటికే సంక్షేమ ఫలాలు

కుల్కచర్ల: బీఆర్ఎస్ పార్టీ అండగా నిలిచి, కారు గుర్తుకు ఓటేస్తే సంక్షేమ పథకాలు మీ ఇంటికే వస్తాయని ఆ పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఇంటింటికీ ప్రచారం చేశారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. సబ్బండ వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అనాలోచిత నిర్ణయంతో అసమర్థులను ఆదరించకుండా, ఆలోచించి గులాబీ పార్టీని గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు సత్యయ్య, బాలు, అబీబ్, శ్రీశైలం, లక్ష్మయ్య, సిద్దులు, శ్రీనివాస్, వెంకట్రాములు, రాంచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆనంద్ గెలుపు ఖాయం..

ధారూరు: అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే ఆనంద్ గెలుపు ఖాయమని బీఆర్ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ జైపాల్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సంతోష్‌కుమార్‌లు ఆశాభావం వ్యక్తంచేశారు. ధారూరు మండలం కొండాపూర్‌ఖుర్దు గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు. అనంతరం మాట్లాడారు. ప్రజల్లో ఉంటూ కష్ట, సుఖాలు తెలుసుకొని వారి సమస్యలు తీర్చిన ఆనంద్‌ను ఆదరించాలని అభ్యర్థించారు.

అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

మర్పల్లి: తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ మరోసారి అధికారంలోకి వస్తేనే పల్లెలు, పట్టణాలు మరింత అభివృద్ధి చెందుతాయని మర్పల్లి జెడ్పీటీసీ పట్నే మధుకర్ అన్నారు. మండల కేంద్రంలో ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలు ఏ రాష్ట్రంలో లేవని, అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అధికారంలోకి వస్తే అన్ని వర్గాలకు మరింత మేలు జరుగుతుందని పేర్కొన్నారు. మోసపూరిత వాగ్దానాలతో మీ ముందుకు వస్తున్న ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దని, కారు గుర్తుకు ఓటేసి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే ఆనంద్‌ను మరోసారి గెలిపించాలని అభ్యర్థించారు. ప్రచారంలో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌గుప్తా, వైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు రమేష్‌మిత్ర, సీనియర్ నాయకులు శ్రీకాంత్, రాచన్న, నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.


మంగళి దుకాణంలో క్షవరం చేస్తున్న జెడ్పీటీసీ

జిల్లాలో మోస్తరు వర్షం

ధారూరు: ధారూరు మండల పరిధి గ్రామాల్లో సోమవారం సాయంత్రం మోస్తరు వర్షం పడింది. ఈ వర్షం కంది పంటకు వరంలా మారింది. మొగ్గ, పూత, కాత దశలో ఉన్న పంటకు నీరు అవసరం అని, ప్రస్తుత వాన రైతులకు మేలు చేస్తుందని ఏఈఓ సంజూరాథోడ్ పేర్కొన్నారు.

వరికి నష్టం

బొంరాస్‌పేట: మోస్తరు వర్షం పడటంతో సాగులో మిశ్రమ ఫలితాలు చూపిస్తున్నాయి. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల పరిధిలో కురిసిన వానతో కోతకు వచ్చిన వరి పంటకు నష్టం కలగనుందని, పూతకొచ్చిన దశలో ఉన్న పల్లికి లాభం చేకూర్చనుందని పలువురు అన్నదాతలు అభిప్రాయపడ్డారు.

ఒకే నామినేషన్

అనంతగిరి: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో భాగంగా వికారాబాద్‌లో సోమవారం ఒకేఒక్క నామినేషన్ దాఖలు అయిందని సంబంధిత అధికారులు తెలిపారు. మర్పల్లి మండలం సిరిపురం గ్రామానికి చెందిన బీజేపీ అభ్యర్థి ఎర్రోళ్ల లక్ష్మయ్య నామపత్రం సమర్పించినట్లు వెల్లడించారు.

హస్తం గూటికి సీపీఎం నేత

అనంతగిరి: సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లేశం, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎస్.రవి తన అనుచరులతో కలిసి సోమవారం మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు సీఎం, కేవీపీఎస్‌లకు చెందిన నాయకులు రవికుమార్, మైపాల్, రాజు, రవీందర్, రఫియొద్దీన్, ఆనంద్, సుజాత ఉన్నారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడారు. ప్రసాద్‌కుమార్ విజయానికి గ్రామ గ్రామాన ప్రచారం చేస్తామని చెప్పారు.

బీఆర్ఎస్‌ను తిరస్కరిస్తున్నారు..

- బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి కిరణ్

పూడూరు: అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు తిరస్కరిస్తున్నారని బీజేపీ పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి మారుతి కిరణ్ బూనేటి అన్నారు. సోమవారం ఆయన మండల పరిధి రాకంచర్ల యోగానందా లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. ప్రస్తుత పరిగి ఎమ్మెల్యే దేవుడి మాన్యాలనూ వదలడం లేదని ఆరోపించారు. తద్వారా ఆలయాలు జీర్ణోద్ధరణకు నోచుకోవడం లేదన్నారు. ప్రాజెక్టుల పేరిట రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్ల రూపాయలను కొల్లగొడుతుందని విమర్శించారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని, అసెంబ్లీ ఎన్నికల్లో కమలం గుర్తుకు ఓటేసి, తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.


బైక్‌ర్యాలీలో మారుతి కిరణ్ బూనేటి

ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలి

- అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి


చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న అడిషనల్ ఎస్పీ

దౌల్తాబాద్: ప్రతి వాహనాన్ని పోలీసులు క్షుణ్ణంగా పరిశీలించాలని అడిషనల్ ఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిధి చంద్రకళ్ గ్రామంలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఎవరైనా సరే నిబంధనలకు విరుద్ధంగా మద్యం, డబ్బు తరలిస్తే కేసులు నమోదు చేయాలని చెప్పారు. కర్ణాటక, గోవా రాష్ట్రాల నుంచి మద్యం సరఫరా అయ్యే అవకాశాలు ఉన్నాయని, పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ రాములు, ఎస్ఐ రమేశ్ కుమార్, పోలిస్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యత

కుల్కచర్ల: ప్రజలకు ఇబ్బంది కలగకుండా పారిశుద్ధ్య పనులు ఎప్పటిప్పుడు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నానని ముజాహిద్‌పూర్ పంచాయతీ కార్యదర్శి సంతోష్ అన్నారు. సోమవారం గ్రామంలో మురుగు కాల్వలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వీధులు శుభ్రంగా ఉండేలా నిరంతరం పారిశుద్ధ పనులు చేపడుతున్నామన్నారు. ఇందుకు ప్రజలు కూడా సహకరించాలని, బహిరంగ ప్రదేశాల్లో చెత్తాచెదారం వేయరాదని, చెత్త సేకరణకు వచ్చే వాహనంలో వేయాలని కోరారు.


మురుగుకాలువను శుభ్రం చేస్తున్న జీపీ సిబ్బంది



అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో రాజకీయ నాయకులు వినూత్న ప్రచారం చేస్తూ ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేస్తున్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్‌లు పట్టణంలోని 26వ వార్డులో ఇంటింటికీ ప్రచారం చేశారు. మొచ్చ వారి వద్దకు వెళ్లి చెప్పులకు పాలిష్ చేసి కాంగ్రెస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఇందులో కౌన్సిలర్ చందర్ నాయక్, మురళీ ఉన్నారు.

– వికారాబాద్ అర్బన్

ఇంటికో ఉద్యోగం ఉత్తదే!


ధారూరు: అవుసుపల్లిలో ప్రచారం చేస్తున్న నేతలు


మోమిన్‌పేట: ప్రచారం చేస్తున్న నరోత్తంరెడ్డి తదితరులు

- యువత జీవితాలతో చెలగాటమాడిన బీఆర్ఎస్
- ఇచ్చిన హామీలు నెరవేర్చని కేసీఆర్
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అందరికీ మేలు
- ఇంటింటి ప్రచారంలో హస్తం శ్రేణులు

మోమిన్‌పేట: తెలంగాణ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు నరోత్తంరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధి రాంనాథ్‌గుడుపల్లి, టేకులపల్లి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌తో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నిరుద్యోగ యువతతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, పబ్లిక్ సర్వీస్ కమిషన్‌లో పేపర్ లీకేజీల వలన ఏళ్లతరబడి కోచింగ్‌లు తీసుకొని పోటీ పరీక్షలు రాసిన యువతీయువకులు నిస్తేజానికి లోనై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదకన వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగం ఉత్తదేనని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. మళ్లీ మాయమాటలు చెబుతూ కారు గుర్తుకు ఓటెయ్యాలని మీ ముందుకు వస్తున్నవారిని తరిమికొట్టాలన్నారు. చేతి గుర్తుకు ఓటేసి పార్టీని గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీటీసీ సభ్యుడు కృష్ణారెడ్డి, నాయకులు సురేందర్, సిరాజొద్దీన్, శివయ్య పాల్గొన్నారు.

అవినీతి పాలనకు అంతం తప్పదు

యాలాల: బీఆర్ఎస్ అవినీతి పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందని కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. యాలాల మండలానికి చెందిన మైనార్టీ యువ నాయకుడు గాజుల మన్నాన్ కాంగ్రెస్‌లో చేరగా.. ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సామాజిక మాధ్యమాల ద్వారా అధికార పార్టీ నాయకులకు, ప్రజాప్రతినిధులను ఎప్పటికప్పుడు సమస్యలపై ప్రశ్నించే మన్నాన్ చేరిక పట్ల సంతోషం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు సంపత్‌కుమార్, బాల్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణచారి ఉన్నారు.

దోచుకుంటున్న బీఆర్ఎస్

ధారూరు: సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చిందని, కానీ రాష్ట్రాన్ని పాలిస్తున్న కేసీఆర్, కేటీఆర్‌లు ప్రజలకు చేసిందేమి లేదని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, మాజీ జెడ్పీటీసీ పట్లోళ్ల రాములు ఆరోపించారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా అవుసుపల్లి గ్రామంలో ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేసి, వాటి గురించి వివరించారు. అనంతరం మాట్లాడారు. పంటనష్ట పరిహారం, వ్యవసాయ సబ్సిడీలను ఎత్తేసి రూ.లక్షల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వెనకేసుకుందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల నియామకం అంటూ దశాబ్ద కాలంగా యువతను మభ్యపెట్టిందని విమర్శించారు. చేతి గుర్తుకు ఓటేసి ప్రసాద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీలో చేరికలు

పూడూరు: వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆ పార్టీ పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. పూడూరు మండలం కండ్లపల్లి, సోమన్‌గుర్తి, మన్నేగుడ, కొత్తపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కొత్తపల్లి సర్పంచ్ పాపిరెడ్డి తదితరులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. కేసీఆర్ వ్యతిరేక పాలన నచ్చకే పార్టీలో చేరుతున్నారని చెప్పారు. పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సురేందర్, నాయకులు సుభాన్‌రెడ్డి, రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదలకు న్యాయం

దోమ: కాంగ్రెస్ పార్టీ గెలిస్తేనే పేదలకు న్యాయం జరుగుతుందని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే అభ్యర్థి టి.రామ్మోహన్ రెడ్డి అన్నారు. దోమ మండలం మల్లేపల్లికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పలువురు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.

పథకాలన్నీ కాగితాలకే పరిమితం!


మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

కుల్కచర్ల: ఇదిగో గృహలక్ష్మి, అదిగో దళితబంధు అంటూ రాష్ట్ర ప్రజలను బీఆర్ఎస్ ప్రభుత్వం మోసం చేసిందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు ఆరోపించారు. మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అమలు సాధ్యం కాని పథకాలను ప్రవేశ పెడుతూ.. వాటిని కాగితాలకే పరిమితం చేసిందని విమర్శించారు. జీపీలు, కేంద్రం నిధులను ఉపయోగించుకొంటూ అంతా తామే చేశామని బీఆర్ఎస్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వాపోయారు. కాంగ్రెస్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. ఇందులో మొగులయ్య, కృష్ణయ్య, బసప్ప, వెంకటేశ్, వెంకటయ్య, గడ్డం వెంకటయ్య, నర్సింహులు ఉన్నారు.

ఇందిరమ్మ రాజ్యం తెస్తాం..

మర్పల్లి: తెలంగాణలో అధికారం చేపట్టి, ఇందిరమ్మ రాజ్యం తెస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ అన్నారు. మండల పరిధి బూచన్‌పల్లి, గుర్రంగట్టు తండాల్లో ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పార్టీ అధికారంలోకి వస్తే అందరికీ మేలని, అర్హులందరికీ ఆరు గ్యారంటీ పథకాలు అందుతాయని చెప్పారు. ప్రచారంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

చేవెళ్ల: విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలతో ముందుకు సాగుతోందని చేవెళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లత అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఇన్‌చార్జి జ్యోతి ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం తొలిమెట్టు కార్యక్రమంపై ఓరియేంటేషన్, వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. పాఠశాలలు పిల్లల కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన తొలిమెట్టు కార్యక్రమం మహోన్నతమైందన్నారు. దీని ద్వారా రాష్ట్రంలోని 25లక్షల మంది వాలంటరీలు ప్రైమరీ స్కూల్ విద్యలో వెనకబడిన విద్యార్థులను గుర్తించి, వారి సమస్యకు పరిష్కారం చూపించేలా పని చేస్తారని చెప్పారు. వారానికి ఒక రోజు ప్రాథమిక పాఠశాలలకు వెళ్లి విద్యా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలన్నారు. తొలిమెట్టు కార్యక్రమంలో డిగ్రీ కళాశాల నుంచి 64 మంది పాల్గొంటారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందటంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని చెప్పారు ఇందులో ఎన్‌సీసీ ఇన్‌చార్జి జ్యోతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి

- మండల విద్యాధికారి హరిశ్చందర్

దోమ: విద్యార్థుల సామర్థ్యాలను పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ అన్నారు. సోమవారం దోమ మండలం పోతిరెడ్డిపల్లి పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల బోధన ఎలా ఉంది? మధ్యాహ్న భోజనం, అల్పాహారం సక్రమంగా అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న వారికి ఇంగ్లిష్‌లో చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదే సమయంలో టీచర్లు బోధిస్తున్న పాఠ్యాంశాలను విద్యార్థులు శ్రద్ధగా వింటూ.. ఎప్పటికప్పుడు వాటిని సాధన చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయుడు నర్సింహులు, ఉపాధ్యాయులు శివలీల, పంచాయతీ కార్యదర్శి గోపాల్, నారాయణ పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ

నేడు చేవెళ్లలో ప్రచారం

చేవెళ్ల: మండల కేంద్రంలోని పలు కాలనీలో మంగళవారం ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేయనున్నట్లు ఆ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, వార్డు సభ్యుడు అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ అభ్యర్థి పామెన భీంభరత్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. మంగళవారం చేవెళ్ల మండలం హౌసింగ్ బోర్డు కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, చంద్రారెడ్డినగర్, వీరభద్ర నగర్, టీచర్స్ కాలనీలతో పాటు కేసారం గ్రామంలో ప్రచారం ఉంటుందని తెలిపారు.